ప్రజాశక్తి
శుక్రవారం 11 అక్టోబర్ 2024 5
అనంతపురం

'పల్లె పండుగ' వారోత్సవాలను

విజయవంతంగా నిర్వహిద్దాం

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు జిల్లాలో జయప్రదంగా నిర్వహించాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ అధికారులకు సూచించారు. పంచాయితీ వారోత్సవాలపై జిల్లా, మండల స్థాయి అధికారులతో గురువారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 14 నుండి 20వ తేదీ వరకు పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలను నిర్వహించాలన్నారు. ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాలను నిర్వహించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో చేపట్టే అభివద్ధి కార్యక్రమాలపై సిటిజన్ ఇన్ఫర్మేషన్ బోర్డులను విధిగా ఏర్పాటు చేయాలన్నారు. పంచాయితీల్లో చేపట్టే పనులకు అధికారికంగా ఆమోదం లభించిందన్నారు. ఈ నేపథ్యంలో భూమి పూజ చేసే కార్యక్రమాల ఫొటోలను తప్పనిసరిగా పోర్టల్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. జిల్లాలోని ముఖ్యమైన పర్యాటక ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా ఏ పనులు చేపట్టాలో గుర్తించాలన్నారు. మొక్కలు నాటే కార్యక్రమం, రోడ్లు తదితర పనులను చేపట్టే విధంగా చూడాలన్నారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండల స్థాయి ప్రత్యేక అధికారులు జిల్లాలో నిర్వహించే ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను పూర్తి స్థాయిలో ప్రజలకు అందే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ సలీమ్ బాషాతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పండుగపూట ధరలమ(వ)ంట



దసరా పండగ వేళ నిత్యావసరాలు, కూరగాయల ధరలు ఆకాశానంటుతున్నాయి. సామాన్యుడు ఏదీ కొనలేని పరిస్థితి నెలకొంది. ఏ దుకాణానికి వెళ్లినా ధరల భారం తప్పడం లేదు. అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలు ఒక్కసారిగా పెరిగాయి. కాయగూరలు, ఆకుకూరలు, నూనెలు, మాంసం, పప్పుల ధరలు అమాంతం పెరిగాయి. ప్రతి నిత్యావసర వస్తువు ధరా రూ.10 నుంచి రూ.20 వరకు పెరిగింది. వంట నూనెలు అయితే ఏకంగా రూ.50 వరకు పెరిగాయి. దీంతో సామాన్యుడి పండుగ పూట ఏదీ కొని పిండవంటలు చేసుకుని తినే పరిస్థితి కన్పించడం లేదు.

- ◆ సెంచరీకి చేరువలో టమోటా
- ◆ పరుగులు పెడుతున్న వంట నూనెలు
- ◆ కూరగాయలు, నిత్యావసరాల అన్ని ధరలూ అధికమే

ప్రజాశక్తి-హిందూపురం

నిత్యావసర ధరలు ఊహించని రీతిలో పెరిగాయి. పక్షం రోజుల కిందట లీటర్ నూనె ధర రూ.20 నుంచి 45కు పెరిగింది. గతంలో రూ.110 ఉన్న నూనె ప్యాకెట్ ధర రూ.140కి చేరుకుంది. వెల్లుల్లి దిగిరానంటూ రూ.400పైనే ఉంది. టమోటో సెంచరీకి చేరువలో ఉంది. కిలో చికెన్ రూ.240కి చేరువైంది. ఉల్లి ధర నెల రోజులుగా కిలో రూ.70కిపైగానే పలుకుతోంది. వెల్లుళ్లి రూ.400కి పెరిగింది. అల్లం కిలో రూ.180 వరకు ఉంది. ఎండు మిరపకాయల ధర సైతం పెరిగాయి. అన్ని రకాల పప్పుల ధరలు కిలో రూ. 20 నుంచి 30కు పైగానే పెరిగాయి. కేంద్ర ప్రభుత్వం నూనె ధరలపై ఎక్సైజ్ సుంకం 12 నుంచి 32 శాతానికి పెంచడంతో నూనె ధరలు ఒక్కసారిగా పెరిగాయి. పూజకు ఉపయోగించే నువ్వుల నూనె నుంచి వంట నూనెల ధరలు కంపెనీని బట్టి కిలోకు రూ.20 నుంచి రూ.40 వరకు పెరిగాయి. వివిధ రకాల పప్పుల మీద కిలోకి రూ.20 నుంచి రూ.40 వరకు ధరలు పెరిగిపోయాయి. బియ్యం కూడా భారీగా పెరిగాయి. మేలు రకం బియ్యం 25 కిలోలు రు.1700 నుంచి రూ.1850 పెరిగాయి. కూరగాయల విషయానికొస్తే వారానికి సరపడా కూరగాయలు మార్కెట్‌లో కొనాలంటే కనీసం రూ.500 ఖర్చు చేయనిదే బుట్టనిండడం లేదు. ఎర్రగడ్డలు, టమోట ధరలు ఆకాశానంటాయి. నాణ్యతను కిలో బట్టి రూ.50 నుంచి రూ.80 వరకు ఎర్రగడ్డలు, టమోటాలు ధరలు పలుకుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో కూరగాయల ధరలు పరిశీలిస్తే కిలో.. ఎర్రగడ్డలు రూ.70, టమోట రూ.90, బంగాళదుంపలు రూ.45, బీన్స్ రూ.80, క్యారెట్ రూ.60, చామగడ్డలు రూ.80, మునగకాయలు రూ. 60, చిక్కుడు కాయలు రూ. 60, బీరకాయలు రూ.50, అనపకాయలు రూ.50, అలసందలు రూ.50, కాకర కాయలు హైబ్రేడ్ రూ.40, నాటి రూ.45, దొండకాయలు రూ.50, ముల్లంగి రూ.40, కాప్సికం రూ.55, బీట్రూట్ రూ.40, అల్లం రూ.160, క్యాలీప్లవర్ రూ.45, క్యాబేజీ రూ. 50, వంకాయలు రూ.30, బెండకాయలు రూ.40, సొరకాయ రూ.30, బజ్జిమిరపకాయలు రూ.50 ధరలు పలుకుతున్నాయి.

పేదోళ్లు ఎలా బతకాలి..?

హోల్‌సేల్ మార్కెట్‌లోనూ ధరలు పెరిగాయి. ఇక వీధుల్లో ఉండే దుకాణ యజమానులు ధరలు భారీగా పెంచి అమ్ముతున్నారు. కూరగాయల ధరలు కూడా అమాంతంగా పెరిగాయి. ప్రభుత్వం పేదలను దృష్టిలో ఉంచుకుని ధరలు తగ్గించే మార్గాలు ఆలోచించాలి.

సుమంగళి, గృహిణి హిందూపురం.

ధరలను నియంత్రించాలి

నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇటీవల అన్ని రకాల వస్తువుల ధరలు భారీగా పెరిగాయి. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ధరల నియంత్రణకు వెంటనే చర్యలు తీసుకోవాలి. నూనెపై ఎక్సైజ్ సుంకం గతంలో 12 శాతం ఉంటే 32 శాతానికి పెంచడంతో నూనె ధరలు అమాంతం పెరిగాయి. మోడీ సర్కారు ఎన్నికల సమయంలో ధరలు తగ్గించి ఆ తర్వాత పెంచుతూ ప్రజలపై భారం మోపుతోంది.

సుబ్బిరెడ్డి,
ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి.

నాగాటి నారాయణ ఆశయాలను కొనసాగిస్తాం

యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నాగాటి నారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

యుటిఎఫ్ ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షుడిగా, జెఎసి నాయకుడిగా పని చేసిన నాగాటి నారాయణ ఆశయాలను కొనసాగిస్తామని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిదరాజులు, లింగమయ్య పిలుపునిచ్చారు. నాగాటి నారాయణ 2వ వర్ధంతి సందర్భంగా గురువారం జిల్లాకేంద్రంలోని యుటిఎఫ్ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులిర్పంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల శ్రేయస్సే పరమావధిగా ఉపాధ్యాయుల ఉన్నతి కోసం నారాయణ అనేక పోరాటాలు చేసారన్నారు. యుటిఎఫ్ అనేక పోరాటాలు చేసి ఉపాధ్యాయులకు ఉద్యోగులకు చాలా మేలు చేసే సౌకర్యాలను ప్రభుత్వం నుంచి పోరాడి సాధించడంలో ఆయన కీలకపాత్ర పోషించారన్నారు. రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమానికి యుటిఎఫ్ అనేక సమరశీల పోరాటాలు చేయడంలో, ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడంలో ఆయన పాత్ర చాలా గొప్పదన్నారు. ఉపాధ్యాయులను, కార్యకర్తలను కదిలించడంలో విశేష కృషి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ గౌరవాధ్యక్షులు రమణయ్య, సహాధ్యక్షురాలు సరళ, వివిధ మండలాల నాయకులు శ్రీనివాసులు, వీరేశ్వరాచారి, గంగాధర్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

జెఎన్‌టియులో ఆయుధపూజ

ప్రజాశక్తి-అనంతపురం

ఆయుధ పూజ చేస్తున్న జెఎన్‌టియు అధికారులు

దుర్గాష్టమి వేడుకల్లో భాగంగా నగరంలోని జెఎన్‌టియు పరిపాలన భవనంలో గురువారం ఆయుధ పూజ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథుగా ఉపకులపతి హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య దుర్గామాతకు పూజలు చేశారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రతి ఒక్కరికీ మంచి కలగాలని ఆకాంక్షించారు. అనంతరం ఉపకులపతి, రెక్టార్, రిజిస్ట్రార్, డిఎపి, డిక్స్ కార్యాలయాలతోపాటు అకౌంట్, ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్లు, ఎగ్జామ్స్ బ్రాంచుల్లో పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, యూనివర్సిటీ డైరెక్టర్లు పిఆర్.భానుమూర్తి, నాగప్రసాద్‌నాయుడు, జి.ప్రశాంతి, ఆర్.కిరణ్మయి, వైశాలి ఘోర్పడే, పి.సుజాత, సురేష్‌బాబు, బి.దుర్గాప్రసాద్, పద్మసువర్ణ, ఎస్‌వి.సత్యనారాయణ, ఎపి.శివకుమార్, ఫైనాన్స్ ఆఫీసర్ ఎం.శిరాజుద్దీన్, భువనవిజయ, కె.మాధవి, కళ్యాణి రాధ, బి.ఓంప్రకాష్, బోధన, బోధనేతర, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తెలిపారు.

జెఎన్‌టియులో బోధనేతర సిబ్బంది బదిలీ

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియులోని 18 మంది బోధనేతర సిబ్బందిని బదిలీ చేస్తూ విసి హెచ్.సుదర్శన్‌రావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో పరీక్షల విభాగం డిప్యూటీ రిజిస్ట్రార్ ఎన్.మధుసూదన్‌రెడ్డిని ఇంజినీరింగ్ కళాశాల డిప్యూటీ రిజిస్ట్రార్ బదిలీ చేశారు. అలాగే ఇంజినీరింగ్ కళాశాల డిప్యూటీ రిజిస్ట్రార్ బి.దుర్గాప్రసాద్‌ను ఒటిపిఆర్ఐకి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ జివిఎస్.శంకర్‌రెడ్డిని పరీక్షల విభాగం అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా, వర్సిటీ ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ అసిస్టెంట్ రిజిస్టార్ కె.మురళీమోహన్‌రావును వర్సిటీలోని రెక్టార్ కార్యాలయానికి బదిలీ చేశారు. వర్సిటీ ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె.ప్రభాకర్‌ను అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల హాస్టల్ విభాగానికి, అకాడమిక్ ప్లానింగ్ డైరెక్టర్ కార్యాలయం అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి.లింగప్పను వర్సిటీ ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌కు బదిలీ చేశారు. జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల హాస్టల్ ఆఫీస్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె.అబ్దుల్‌ఖాదర్‌ను ఇంజినీరింగ్ కళాశాలకు బదిలీ చేశారు. హాస్టల్ ఆఫీసులో సూపరింటెండెంట్‌గా ఉన్న ఎస్.శివశంకర్‌గౌడ్‌ను పరీక్షలు విభాగానికి, ఉపకులపతి కార్యాలయం సూపరింటెండెంట్ డి.శ్రీనివాసులును ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్, వర్శిటీ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ డైరెక్టర్ కార్యాలయం సూపరింటెండెంట్ బి.సునీల్ కుమార్ ఆల్యూమినీ మీట్ ఆఫీస్‌కు బదిలీ చేశారు. వీరితోపాటు మరో 8 మంది సీనియర్ అసిస్టెంట్ స్థాయి సిబ్బందిని అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలోని వివిధ విభాగాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

దులీప్ ట్రోఫీ విజయవంతంపై కృతజ్ఞతలు

కలెక్టర్‌కు బొకే అందిస్తున్న ఎడిసిఎ ప్రతినిధులు

అనంతపురం : జిల్లా కేంద్రంలోని ఆర్డీటీ మైదానంలో ఇటీవల నిర్వహించిన దులీప్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లను విజయ వంతంగా నిర్వహిం చేందుకు సహకరించిన కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్‌కు అనంతపురం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు గురువారం కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ప్రభుత్వ పరిపాలన జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, జిల్లా ఎస్పీ జగదీష్ ఆధ్వర్యంలో క్రీడాకారులు, ప్రేక్షకులకు పోలీసు భద్రత, వైద్య సాయం, ట్రాన్స్‌కో, అగ్నిమాపక యంత్రాలు, అగ్నిమాపక యంత్రం, జిల్లా రెవెన్యూ సేవలను అందించడానికి జిల్లా అగ్నిమాపక సేవలను అందించారన్నారు. అలాగే పార్కింగ్, పరిసరాలను శుభ్రం చేయడానికి ఎంతో సహకరించారన్నారు. ఇందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడిసిఎ అధ్యక్షుడు పీఎల్ ప్రకాష్‌రెడ్డి, కార్యదర్శి కె.మధుఆచారి, కోశాధికారి షబ్బీర్ అహ్మద్, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ పి.సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్ తనిఖీ

కళ్యాణదుర్గం రూరల్ : కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్‌లోని కనేకల్ మండలంలో ఉన్న రుచ్చుమర్రి ఇసుకరీచ్‌ను ట్రైనీ కలెక్టర్ ఇన్‌ఛార్జి ఆర్‌డిఓ వినూత్న గురువారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులను పరిశీలించి ఇసుక రవాణాపై స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ వినూత్న

హెచ్‌ఎల్‌ఎంసికి రూ.35 కోట్లు అవసరం

◆ అధికారుల అంచనా ◆ ప్రభుత్వం నిధులు విడుదల చేసేనా..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాకు ఏకైక నికర జలవనరులున్న ప్రాజెక్టు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ (హెచ్‌ఎల్ఎంసి). 70 సంవత్సరాల క్రితం చేపట్టిన ఈ ప్రాజెక్టు నిర్వహణ రోజురోజుకు తీసికట్టుగా మారింది. ఇటీవలే ఈ కాలువకు నీటిని అందించే ప్రాజెక్టు తుంగభద్రలో ఒక గేటు కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఇదే సమయంలో ఇప్పుడు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ పరిస్థితిపైనా సర్వత్రా చర్చ నడుస్తోంది. ఎందుకంటే ఎప్పుడో నిర్మించిన ఈ కాలువ నిర్వహణ సరిగా లేక అనంతపురం జిల్లాకు సాగు, తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఆధునీకరణ చేపట్టినా మధ్యలోనే పనులను నిలిపివేయడంతో కాలువ పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారింది. దీంతో పూర్తి సామర్థ్యంతో నీటిని కూడా తీసుకోలేని పరిస్థితులు నెలకొన్నాయి. 1800 క్యూసెక్కుల్లోపే నీరు జిల్లాకు వస్తోంది. ఒకవైపు వృథాగా నదిలోకి పోతున్నా అదనంగా నీరు తీసుకోలేకపోతున్నాం. అది కూడా బిక్కుబిక్కుమంటూనే తీసుకోవాల్సి వస్తోంది.

తక్షణ మరమ్మతులకు రూ.35 కోట్లు అవసరం ?

హెచ్‌ఎల్‌ఎంసి పూర్తి ఆధునీకరణ కాకున్నా ఒక మోస్తర నీటిని తీసుకోవాలంటే కూడా తక్షణం రూ.35 కోట్లు మరమ్మతులకు అవసరమవుతాయని హెచ్‌ఎల్‌ఎంసి అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో ప్రధానంగా రెగ్యులేటరీలే మూడున్నాయి. కణేకల్ చెరువు వద్ద, పిఎబిఆర్, మిడ్‌పెన్నార్ ఇలా మూడు ప్రధానమైన చోట్ల కూడా రెగ్యులేటరీలు దెబ్బతిన్నాయి. 137వ కిలోమీటరు వద్ద అండర్ టన్నెలు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. 115వ కిలోమీటరు నుంచి 130 కిలోమీటరు మధ్య కాలువ పూర్తిగా దెబ్బతిని ఉంది. దీనికి మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. ఇవి కాకుండా ఇంకా అనేక పనులున్నప్పటికీ హెచ్‌ఎల్‌ఎంసి అధికారులు ఈ పనులను ఇంకా పరిగణలోకి తీసుకోలేదు. ప్రధానంగా పిఎబిఆర్ లింక్ కెనాల్ ప్రవాహ సామర్థ్యం తక్కువగా ఉండటమే కాకుండా ఉన్నది కూడా సరిగా లేదు. ఇక బొమ్మనహల్ నుంచి కణేకల్ మధ్య సుమారు 17 వరకు బ్రిడ్జిలు శిథిలావస్థకు చేరాయి. అటువైపు వాహనాలుగానీ, మనుషుల రాకపోకలుగానీ చేయలేని పరిస్థితి ఉంది. ప్రధానంగా పొలాలకు వెళ్లాలంటే రైతులు పది నుంచి 20 కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సి వస్తోంది. ఈ పనులను ఈ అంచనాల్లో రూపొందించలేదు.

కొత్త ప్రభుత్వం దృష్టి సారించేనా ?

గత ప్రభుత్వ హయాంలో ఈ పనులను పూర్తిగా నిలిపేశారు. ఈ మేరకు ఆధునీకరణ పనులను రద్దు చేస్తూ ఉత్వర్వులిచ్చారు. ఇప్పుడు కొత్త ప్రభుత్వం ఈ జీవోను రద్దు చేస్తామని ప్రకటించింది. ఈ పరిస్థితుల్లో ఆధునీకరణ పనులు చేపడతారా.. లేదా.. అన్న దానిపై స్పష్టతనివ్వలేదు. కాలువల ఆధునీకరణకు అధికారులు అంచాన వేసిన మేరకు కనీసం తక్షణ మరమ్మతులకు అవసరమైన రూ.35 కోట్లు అయినా విడుదల చేస్తుందా.. లేదా.. అన్నది చూడాల్సి ఉంది. మరోవైపు సాగునీటి ప్రాజెక్టులపై సిపిఎం ఈనెల బస్సు యాత్రను చేపట్టింది. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుయకు ఈ పోరాటానికి సిద్ధమైంది.

కానిస్టేబుళ్లకు ఎస్పీ అభినందన

కానిస్టేబుల్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం : జాతీయ స్థాయి యోగాసనాల పోటీలకు ఎంపికైన కానిస్టేబుల్‌తోపాటు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన కానిస్టేబుల్‌ను గురువారం తన కార్యాలయంలో ఎస్పీ పి.జగదీష్ అభినందించారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో జిల్లాకు చెందిన కానిస్టేబుళ్లు ఎం.చలపతి, దీప పతకాలతోపాటు ప్రశంసాపత్రాలు అందుకున్న విషయం తెలిసిందే. వీరిద్దరూ ఈనెల 5నుంచి 7వ తేదీ వరకూ కర్నూలులోని మాంటిస్సోరి ఇండస్ స్కూల్‌లో జరిగిన 5వ రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో పాల్గొని సీనియర్ గ్రూప్-బి మెన్ విభాగంలో ఎం.చలపతి 2వ స్థానం, సీనియర్ గ్రూప్-బి- ఉమెన్ విభాగంలో జి.దీప 5వ స్థానం కైవసం చేసుకున్నారు. వీరిలో ఎం.చలపతి త్వరలో కర్ణాటక రాష్ట్రం మైసూరులో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

మరింత చేరువగా ఆర్టీసీ సేవలు : కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు మరిన్ని పల్లెవెలుగు ఆర్టీసీ సర్వీసులను నడపనున్నట్లు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. గురువారం పట్టనంలోనీ ఆర్టీసీ బస్టాండ్ వద్ద రాయదుర్గం-బళ్లారి నడుమ నడిచే రెండు కొత్త పల్లె వెలుగు బస్సు సర్వీసులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వందరోజుల్లోనే రాయదుర్గం డిపో నుంచి ఐదు కొత్తబస్సులను ప్రారంభించినట్లు తెలిపారు. మరో రెండు హైటెక్ బస్సులు, ఒక ఎక్స్‌ప్రెస్ బస్సులు రానున్నట్లు తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం బడిబస్సులను కూడా నడుపుతామన్నారు. రాయదుర్గం ఆర్టీసీ డిపోతోపాటు బస్టాండ్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ సురేష్, టిడిపి నాయకులు మహబూబ్‌బాషా, భారతి, జనసేన నాయకుడు మంజునాథ్‌గౌడ్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలను మెరుగుపర్చాలని వినతి

రాయదుర్గం డిపోలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు ఎపి పిటిడి నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ ఆయా సమస్యలను పరిష్కరించేందుకు త్వరలోనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీ ఎస్.నాగరాజు, జోనల్ ఉపాధ్యక్షులు ఎంఎండి షఫీ, రీజినల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రవినాయక్, రీజినల్ ఉపాధ్యక్షులు దామోదర్, డిపో సెక్రటరీ తిప్పేస్వామి, డిపో ప్రెసిడెంట్ జిలాన్, సిసిఎస్ డెలిగేట్ నాగరాజు, గ్యారేజ్ అధ్యక్ష, కార్యదర్శులు దూద్‌పీరా, సతీష్‌కుమార్, బాలాజీనాయక్, సత్తార్‌ఖాన్, రామాంజనేయులు, నారాయణ, ఈశ్వర్‌రెడ్డి, షబ్బీర్, సతీష్, బషీర్, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

పల్లెవెలుగు బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

మానసిక ఆరోగ్యంతోనే సమాజాభివృద్ధి

జిల్లా సీనియర్ సివిల్ జడ్జి జి.శివప్రసాద్‌యాదవ్

సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం

మానసిక ఆరోగ్యంతోనే సమాజాభివృద్ధి సాధ్యమని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి జి.శివప్రసాద్‌యాదవ్ సూచించారు. అనంతపురం సైకియాట్రిక్ సొసైటీ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఇన్నర్ వీల్ క్లబ్, ఎన్ఎస్-ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఐఎంఎ హాలులో మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. తర్వాత వివిధ కళాశాలల్లో నిర్వహించిన పోటీల విజేతలకు ప్రశంసాపత్రాలు, మోమెంటో, మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి శివప్రసాద్‌యాదవ్ మాట్లాడుతూ ప్రస్తుతం యువత మానవ సంబంధాల కంటే సెల్‌ఫోన్ సంబంధాలకే ఎక్కువ విలువ ఇస్తోందన్నారు. తద్వారా మానవ సంబంధాలు క్షీణించి మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. అప్పుడే శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకుని ప్రశాంతమైన జీవితం సాగిస్తామన్నారు. ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పని చేసే ప్రదేశాల్లో మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. సమస్యలు లేని జీవితం, గాలిలేని ప్రదేశం ఉండదన్నారు. ప్రతి సమస్యనూ తోటివారితో పంచుకుంటే సమాధానం దొరుకుతుందన్నారు. మనలో మనమే బాధపడుతూ కూర్చుంటే కూర్చుంటే మానసిక సమస్యలకు దారి తీస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ డాక్టర్ మురళీకృష్ణ, ఇన్నర్ వీల్ క్లబ్ ప్రెసిడెంట్ ఎం.జయంతి, సీనియర్ వైద్యులు డాక్టర్ శ్రీనాథ్, డాక్టర్ ప్రసూన, మనోరంజన్ రెడ్డి, డాక్టర్ సుప్రజా చౌదరి, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, బిసాటి భరత్, కురుబ జయ మారుతి, ఇన్నర్ వీల్ సభ్యులు శ్రీవల్లి వేదం, సవీరా నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఝాన్సీరాణి, లెక్చరర్లు హృతిక్, అనూషా, రమ్య, సుజాత, చిన్ని, నాగమోహన్, బాలరాజు, సవీరా నర్సింగ్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

యాడికి : ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా మానసిక వైద్య నిపుణులు విశ్వనాథ్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ప్రదేశాల్లో ఒత్తిడిని జయించాలన్నారు. అప్పుడే మానసిక ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ శ్రీరామ్‌కుమార్, డాక్టర్ పరమేశ్వర్లు, సిహెచ్ఒ జుబేదా, పిహెచ్ ఎన్ వెంకటలక్ష్మి, సూపర్‌వైజర్ రామ్‌ప్రసాద్‌గౌడ్, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వం ఆసుపత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మానసిక జిల్లా వైద్యాధికారి డాక్టర్ విశ్వనాథరెడ్డి, డాక్టర్ శ్రీనివాసబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మానసిక ఆరోగ్యం సాధించినప్పుడే ఏదైనా సాధించవచ్చన్నారు. ముఖ్యంగా తాము పని చేస్తున్న ప్రదేశంలో ప్రశాంత వాతావరణం ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసబాబు, డాక్టర్ అమర్నాథ్, సిహెచ్ఒ చిట్టితల్లి శ్రీనివాసులు, నాగలక్ష్మమ్మ, ఆశావర్కర్లు, ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పి, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం ఎంపిడిఓగా నందకిషోర్

బ్రహ్మసముద్రం : మండల నూతన ఎంపిడిఓగా నందకిషోర్ గురువారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నందకిషోర్ మాట్లాడుతూ ప్రజలందరికీ అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ఎవరి కోసం దుకాణాల దరఖాస్తు గడువు పొడిగింపు..?

అనంతపురం : టిడిపి, జనసేన, బిజెపి నాయకుల మధ్య సర్దుబాటు కోసమే ప్రభుత్వం మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించిందని ఉరవకొండ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి ఆరోపించారు. గురువారం జిల్లాకేంద్రంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ సిఎం జగన్ ప్రవేశపెట్టిన మద్యం విధానంలో మార్పులు, చేర్పులు చేస్తోందన్నారు. తద్వారా క్రైమ్ రేట్ మరింత పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చెయ్యకుండా డైవర్షన్ రాజకీయాలు చేస్తోందన్నారు. ఇకనైనా హామీల అమలుపై దృష్టి సారించాలని హితవు పలికారు.

కార్మికులకు ఆర్థికసాయం

అనంతపురం : దసరా పండుగ సందర్భంగా రుద్రంపేట పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు ఎంపిటిసి మహబూబ్‌బీ గురువారం రూ.20వేలు ఆర్థికసాయం అందించారు. పారిశుద్ధ్య కార్మికుల కుటుంబాలు దసరా పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఎంపిటిసి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాదిక్, వెంకట్రాముడు, అక్కమ్మ, జయమ్మ, భాజా, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న ఎంపిటిసి మహబూబీబీ

IN THE COURT OF THE HON'BLE
III ADDL. DISTRICT AND SESSIONS JUDGE,
BALLARI ESITTING AT HOSAPETE
Cr.R.P.5080/2024

Petitioners
1) T.Latha @ Sreelatha, W/o T.Thippaiah D/o Sreenivasalu, Aged about 34 yrs Household work
2) Kum.Sowjanya, D/o T.Thippaiah, Aged about 13 yrs Student
3) Samartha Prahallada, S/o T.Thippaiah, Aged about 11 years Student
The petitioners 2 and 3 are minors, represented by their natural guardian mother Petitioner No. 1 All are residents of K. Rayapura Village, Kudligi Tq, Vijayanagara Dist, Now present residing at Amakundhi Village, Molakalmuru Tq, Chitradurga Dist.,
Vs.
Respondent : T.Thippaiah, S/o Late Krishnappa, Aged about 35 Yrs, Agriculturist and Driver, R/o Golla Veedhi, D.Hirehal Village, Rayadurga Tq, Ananthapura District. Mob.9972299069.
PAPER PUBLICATION
The petitioners have filed the above petition against the respondent for enhancement of maintenance amount and for modification of order of the lower court in Crl. Mis No. 533/2020 order dtd. 20-12-2021. On that date of hearing i.e., on **16th November 2024 at 10.30 AM**, you should present before the Hon'ble Court on that day personally or through your advocate, otherwise this petition is decreed in favour of the petitioners. This paper publication is made on 7th day of October 2024 with the seal and signature of this Hon'ble Court.
Vijayanagara — By the order of
H.K.Vijaya Kumar — Chief Ministerial Officer
Advocate for — Chief Executive Officer
Petitioners — Hon'ble III Addl.District and Sessions Judge at Vijayanagara

బళ్ళారి జిల్లా గౌరవనీయులైన III అదనపు జిల్లా కోర్టు మరియు సెషన్స్ జడ్జ్ బళ్ళారి & విజయనగరం జిల్లా, హొస్పేట్ పీఠస్థిత్
Cr.R.P.5080/2024
పిటీషనర్స్ :
1. టి.లత అలియాస్ శ్రీలత, W/o టి.తిప్పయ్య D/o శ్రీనివాసులు, వయస్సు సుమారు 34 సం.లు ...
2. కు.సౌజన్య, D/o టి.తిప్పయ్య, వయస్సు సుమారు 13 సంవత్సరాలు విద్యార్థి
3. సమర్థ ప్రహల్లాద, S/o టి.తిప్పయ్య, వయస్సు సుమారు 11 సంవత్సరాలు విద్యార్థి
[illegible]
ప్రతివాది :
1. టి.తిప్పయ్య, S/o లేట్ క్రిష్ణప్ప ...
పేపర్ ప్రకటన
[illegible]
... తేదీ 20-12-2021 ... 16 నవంబర్ 2024 ఉదయం 10.30 గంటలకు ... 07-10-2024 ...
హెచ్.కె.విజయ కుమార్, చీఫ్ మినిస్టీరియల్ ఆఫీసర్, అడ్వకేట్ ఫర్ పిటీషనర్స్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్,
గౌరవనీయులైన III అదనపు జిల్లా కోర్టు మరియు సెషన్స్ జడ్జ్, విజయనగరం

కార్పొరేషన్‌లో కంప్యూటర్ల కొరత

పాత సిస్టమ్స్‌తో ఇబ్బందులు పడుతున్న సిబ్బంది-కొత్త కంప్యూటర్ల కోసం తప్పని ఎదురుచూపులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో పరిపాలన అధికారం ఉన్న విభాగాలను కంప్యూటర్ల కొరత పట్టిపీడిస్తోంది. ప్రత్యేకించి అడ్మినిస్ట్రేషన్ వ్యవహారాలు చక్కబెట్టే సివిల్ సీటుకు పనిచేయని కంప్యూటర్లు ఉండడంతో అక్కడ పని చేసే సిబ్బందికి పాలనాపరంగా అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సూపరింటెండెంట్ ఇంజినీర్ భాస్కర్‌రావు ఛాంబర్‌లో పాత కంప్యూటర్ ఉంది. ఇది పని చేయకుండా మొరాయిస్తోంది. ప్రజారోగ్య విభాగం ఎఫ్1 సీటులో పారిశుద్ధ్య వర్కర్ల జీతభత్యాలు, ఇంక్రిమెంట్లు డీఏలు తదితర అన్నింటినీ పరిశీలిస్తూ ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాల్సి ఉంటుంది. ఈ విభాగంలో కూడా సరైన కంప్యూటర్లు లేవు. నూతన కంప్యూటర్లు ఇవ్వాలని 15 రోజుల క్రితం ఇక్కడి సిబ్బంది కమిషనర్ నాగరాజును కోరారు. పరిపాలన విభాగం వ్యవహారాలు నిర్వహించే సి1 సీటు కంప్యూటర్ తరచూ మొరాయిస్తోంది. ఏడాదిన్నర క్రితం కొత్త కంప్యూటర్లు బదిలీపై వచ్చిన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు ఏర్పాటు చేయాల్సి ఉన్నా జాప్యం జరుగుతోంది. ఇంజినీర్ల బదిలీలు జరిగిన తర్వాత కొత్త కంప్యూటర్లు తెప్పించారు. ఇంతకాలం సొంత ల్యాప్‌టాప్‌లోనే డీఈలు కార్యాలయ విధులను నిర్వహించారు.

కంప్యూటర్ల కొనుగోలు నిమిత్తం గతంలో నాలుగైదు సార్లు షార్ట్ టెండర్లు నిర్వహించారు. ఇందులో మార్కెట్ ధరల కన్నా తక్కువ ధరకు కోట్ చేసిన టెండర్లు పిలవడంతో వీటిని ఏర్పాటు చేసేందుకు గుత్తేదారులు ఎవరూ ముందుకు రాలేదు. తాజాగా కడపకు చెందిన

మొరాయిస్తున్న కంప్యూటర్లతో కుస్తీలు పడుతున్న సిబ్బంది

జ్ఞాననేత్ర అనే వ్యక్తి రూ.6,95,360 విలువజేసే కంప్యూటర్లను తెప్పారు. ఇందులో డెల్ కంపెనీ టవర్ 6 సిస్టమ్స్, ఏపిలోని హెచ్‌పి ప్రింటర్లు 18 ఎన్ టైప్ చైర్లు, మూడు ఆఫీస్ టేబుళ్లు, 8 అల్మారాలు, ఒక డెల్ సిపియును తెప్పించారు. ఈ మెటీరియల్ తెప్పించటానికి నాలుగు సార్లు షార్ట్ టెండర్ నోటీసులు నిర్వహించారు. దీని వల్ల మున్సిపల్ కార్పొరేషన్ ఖజానాపై అదనపు భారం పడింది. ఇదంతా ఆఫీసు నిర్వహణ అధికారి అయిన ఒక డిఈ నిర్వాకమే వల్లే జరిగిందని కార్పొరేషన్‌లో చర్చ జరుగుతోంది. ఇటీవల బదిలీపై వచ్చిన కొత్త సూపరింటెండెంట్ ఇంజినీర్‌కు అమర్చిన కంప్యూటర్ పాతది కావడంతో అది సరిగా పని చేయడం లేదు. ఇతర విభాగాల్లో కంప్యూటర్ల పాడైపోయి పనిచేయని పరిస్థితి నెలకొంది. నూతనంగా తెప్పించిన ఆరు కంప్యూటర్లలో ఒకటి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షాకీర్ హుస్సేన్, మేనేజర్ లక్ష్మీదేవి, బదిలీపై వెళ్లనున్న డిఈ చంద్రశేఖర్, డిఈ సుభాష్ చంద్రబోస్, అసిస్టెంట్ ఇంజినీర్ విజయరాజు, ఆఫీస్ నిర్వహణ అధికారి డిఈ దాక్షాయినికి ఏర్పాటు చేశారు. ఎస్ టైప్ రివాల్వింగ్ కుర్చీలను కొత్త కౌన్సిల్ హాల్లోకి నాలుగు, డిఈ దాక్షాయిని ఛాంబర్‌కు ఒకటి ఇచ్చారు. పాతబడిన కుర్చీల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి మాత్రం కొత్తవాటిని ఏర్పాటు చేయలేదు. సూపరింటెండెంట్ ఇంజినీర్ ప్రజారోగ్యం అడ్మినిస్ట్రేటివ్ విభాగానికి అత్యవసరంగా నూతన కంప్యూటర్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఆదిశలో అది జరగలేదు. ఈ విభాగంలో అత్యవసర పనులు నిత్యం చేయాల్సి ఉన్నా, కంప్యూటర్లు మాత్రం ఏర్పాటు చేయడం లేదు. అత్యవసర విభాగాలకు అవసరమైన నూతన కంప్యూటర్లకు మెుత్తం లభించటం మరో ఏడాదిన్నర కాలానైనా పట్టేలా ఉందని సిబ్బంది చర్చించుకుంటున్నారు. కొందరు అధికారులు పనులు జరగకుండా అడ్డు తగలడం వల్లనే కంప్యూటర్ల ఏర్పాటులో జాప్యం జరుగుతోందని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

బదిలీపై వెళ్లిన కమిషనర్ మేఘ స్వరూప్ ఇంటికి అమర్చిన నాలుగు ఏసీల్లో ఒకటి ఆఫీసు నిర్వహణాధికారి ఛాంబర్‌కు, మరొకటి అదనపు కమిషనర్ ఛాంబర్‌కు అమర్చారు. మిగతా రెండు ఏసీలను అవసరమైన చోట్ల అమర్చకుండా పక్కన పెట్టారు. కంప్యూటర్లతో విధులు నిర్వహించే విభాగాలకు మాత్రం ఏసీలను ఏర్పాటు చేసేందుకు నిర్వహణాధికారి సుముఖత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. తన గదికి అవసరమైన అన్నింటినీ కొత్త వాటిని ఏర్పాటు చేసుకోవడంలో ఆ నిర్వహణ అధికారికి ఉన్న శ్రద్ధ ఇతర విభాగాల అవసరాలను గుర్తించడంలో లేదనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రజా అవసరాల నిమిత్తం కార్పొరేషన్‌లో అవసరం అయిన అన్ని నూతన విభాగాలకు కొత్త కంప్యూటర్లను ఏర్పాటు చేయాలని అధికారులు, సిబ్బంది కోరుతున్నారు.

రతన్‌టాటాకు నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

రతన్ టాటా మతి భారతీయులందరికీ తీరని లోటని మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో రతన్‌టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రముఖ పారిశ్రామిక వేత్తగా, మానవతా వాదిగా దాతృత్వం కలిగిన గొప్ప మనిషి రతన్ టాటా అని కొనియాడారు. రతన్ టాటా పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతిసాహిత్య, కమిషనర్ నాగరాజు, కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, కమల్‌భూషణ్, నరసింహులు, రహంతుల్లా, అనిల్‌కుమార్‌రెడ్డి, ఇలా రాధాకృష్ణ, షాకీర్‌హుస్సేన్, డిఈఇ సుభాష్‌చంద్రబోస్, మేనేజర్ లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కార్పొరేషన్‌లో రతన్‌టాటాకు నివాళులర్పిస్తున్న నాయకులు

రాయదుర్గం : భారత వ్యాపార దిగ్గజం రతన్‌టాటాకు రాయదుర్గం పట్టణంలోని ప్రయివేట్ పాఠశాల యాజమాన్యం (అపుస్మా) నివాళి అర్పించింది. ఇందులో భాగంగా గురువారం పట్టణంలోని సెయింట్ పాల్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అపుస్మా తాలూకా అధ్యక్షులు ఎం.వన్నూరుస్వామి మాట్లాడుతూ దేశ వ్యాపార సామ్రాజ్యంలో తనకంటూ ఒక స్థానాన్ని ఏర్పరుచుకుని లక్షల మంది జీవితాల్లో వెలుగు నింపిన మానవతామూర్తి రతన్‌టాటా అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అపుస్మా రాయదుర్గం తాలూకా గౌరవ సలహాదారులు ఆయుబ్‌ఖాన్, స్టోన్‌వ్యాలీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి 'పల్లె పండుగ'

ప్రజాశక్తి-పుట్లూరు

మండల వ్యాప్తంగా ఈనెల అక్టోబర్ 14వతేదీ నుంచి ప్రారంభం కానున్న పల్లె పండుగను విజయవంతం చేయాలని ఎంపిడిఓ అలివేలమ్మ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 21వతేదీ వరకూ ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జడ్పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులను ఆహ్వానించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఒ చెన్నకేశవులు, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓ గంగావతి అధ్యక్షతన మండల పరిధిలోని పంచాయతీల కార్యదర్శులు, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ మండలవ్యాప్తంగా ఈనెల 14 నుంచి నిర్వహించనున్న పల్లె పండుగను

యల్లనూరులో మాట్లాడుతున్న అధికారులు

విజయవంతం చేయాలని కోరారు.

యల్లనూరు : మండల వ్యాప్తంగా ఈనెల 14 నుంచి నిర్వహించనున్న పల్లె పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇన్‌ఛార్జి ఎంపిడిఓ వాసుదేవరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీల అభివృద్ధి పై చర్చించేందుకు పల్లె పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఓ వాసుదేవరెడ్డి, ఏపిఒ షబ్బీర్, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వికలాంగులకు చేయూతనివ్వాలి

మూడు చక్రాల వాహనాన్ని అందజేస్తున్న దృశ్యం

అనంతపురం కలెక్టరేట్ : దివ్యాంగులు స్వశక్తితో సమాజంలో ముందుకు సాగేలా వారికి చేయూత నివ్వాలని వృద్ధులు, వికలాంగులు, హిజ్రాల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.అబ్దుల్‌రసూల్ పిలుపునిచ్చారు. ఎకోస్ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం జిల్లా వికలాంగుల, హిజ్రాల సంక్షేమ శాఖ కార్యాలయంలో పేద దివ్యాంగుడు బాషాకు త్రిచక్ర వాహనాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ ప్రభుత్వంతో పాటు, స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో సమాజంలో అన్నిరంగాల్లో వెనుకబడిన దివ్యాంగులు, అనాథ వృద్ధులు, హిజ్రాల సంక్షేమం కోసం కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఎకోస్ సేవా సమితి ప్రధాన కార్యదర్శి కమల్‌నాథ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో మహాబోధి కృష్ణమూర్తి, ఫైట్ ఫర్ రైట్స్ సంస్థ అధ్యక్షులు కెపి.రాజు, కళాకారుడు, పాత్రికేయులు తోట నాగరాజు, కె.అనిల్‌కుమార్‌రెడ్డి, షార్ట్ ఫిల్మ్ డైరెక్టర్ తరిమెల రాజు, శంకర్‌రెడ్డి, సుధాకర్, రమేష్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ బుకింగ్‌లో సూపర్ చెక్

ఉరవకొండ : ఈ-క్రాప్ బుకింగ్‌లో భాగంగా ఉరవకొండ డివిజన్ ఏడిఎ పద్మజ సూపర్ చెక్ చేశారు. గురువారం విడపనకల్ మండల పరిధిలోని డొనేకల్ గ్రామంలో రైతులు విజయకుమార్‌తోపాటు కడదల బెంచి గ్రామంలో హనుమేష్ సాగు చేసిన కందిపంటలో ఈక్రాప్ బుకింగ్ చేశారు. అరంతరం పొలాలకు సంబంధించి రికార్డులను తనిఖీ చేశారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించాలని వినతి

పామిడి : గుంతకల్లు డివిజన్‌లోని ఎస్సీ, ఎస్టీల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు గురువారం గుంతకల్లులోని ఆర్‌డిఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో బాధ్యతలు చేపట్టిన ఆర్‌డిఓ శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా మొక్క అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుంతకల్లు డివిజన్ పరిధిలో ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. అక్రమిత కేసులకు సత్వర పరిష్కారం చూపాలన్నారు. భూ సమస్యలు పరిష్కరించాలని, అంటరానితనం, వివక్ష రూపుమాపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు చకలి రవి, సాకే గోవిందు, హరిప్రసాద్‌యాదవ్, కావలి మల్లికార్జున, పెనకొండ చంద్రయ్య, శేఖర్, బాబయ్య, నల్లప్ప, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సులో డా॥కేశవరావుకు ప్రథమ బహుమతి

ప్రజాశక్తి-అనంతపురం

పెథాలజీ డాక్టర్‌ను అభినందిస్తున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ మాణిక్యరావు

పాండి చేరిలోని శ్రీవెంకటేశ్వర వైద్య కళాశాల, రీసెర్చ్ సెంటర్‌లో నిర్వహించిన జాతీయస్థాయి వైద్య విద్య సదస్సులో అనంతపురం ప్రభుత్వ మెడికల్ కళాశాల పేథాలజీ వైద్య విభాగం ప్రథమ సంవత్సరం పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థి డాక్టర్ కేశవరావు పోస్టర్ ప్రజెంటేషన్‌లో బహుమతి సాధించినట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.మాణిక్యరావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఛాంబర్‌లో కేశవరావును పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ విజయం కళాశాల సాధించిన ప్రతిభకు నిదర్శనమన్నారు. డాక్టర్ కేశవరావు పరిశోధనపై శిక్షణ ఇచ్చిన ప్రధాన విభాగాధిపతి డాక్టర్ శివశంకర్‌నాయక్, డాక్టర్ లక్ష్మి, డాక్టర్ భవాని, డాక్టర్ శ్రావణి, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ టిఎన్ సుమన్‌కుమార్, డాక్టర్ దివ్య, డాక్టర్ చైతన్యను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ షారోన్ సోనియా, డాక్టర్ తెలుగు మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

అరవింద్ డయాబెటీస్, కంటి ఆసుపత్రి ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని సాయినగర్ 1వక్రాస్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అరవింద్ డయాబెటీస్, కంటి ఆసుపత్రిని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఎండీ డాక్టర్ జానకి అరవింద్‌కుమార్ మాట్లాడుతూ అత్యాధునిక వైద్య పరికరాలతో అరవింద్ డయాబెటీస్, కంటి ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులో తీసుకురావడం ఈ భవిష్యత్ తమ ఆశయం అన్నారు. పేదలకు ఉన్నత వైద్యం అందించడమే తమ ముందున్న ముఖ్య ఉద్దేశమన్నారు. ఈకార్యక్రమంలో ప్రముఖ కంటి వైద్య నిపుణులు ప్రియ లిఖితారెడ్డి, ఆసుపత్రి సిబ్బంది, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై దృష్టి కేంద్రీకరించాలి

ప్రముఖ సైకాలజిస్ట్ వై.సురేష్‌బాబు

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రతి విద్యార్థి శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యంపై దృష్టి కేంద్రీకరించాలని ప్రముఖ సైకాలజిస్ట్ వై.సురేష్‌బాబు సూచించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు. ప్రపంచ మానసిక ఆరోగ్య సమాఖ్య సూచనల మేరకు ప్రతి సంవత్సరం అక్టోబర్ 10న మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. పని, సంబంధిత ఒత్తిళ్ల కారణంగా ఎక్కువ మంది ఒత్తిడి, ఆందోళన, నిరాశను అనుభవిస్తున్నందున వారిలో మానసిక ప్రశాంతత క్షీణిస్తోందన్నారు. ప్రశాంతమైన జీవన విధానాన్ని పడుపునే సంబంధం లేకుండా అందరూ అమలు చేయాలని కోరారు. మానసిక ఆరోగ్యంపై అందరికీ అవగాహన తప్పనిసరన్నారు. ఇందులో భాగంగా ఈనెల 11న చిన్న పిల్లలు, టీనేజ్ వారికి, 12న యువతీ యువకులకు, 13న బాలికలు, మహిళలు, 14న విద్యార్థులు, నిరుద్యోగులు, 15న తల్లిదండ్రులు, 16న వయోవృద్ధుల కోసం ఉచిత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కాగా మానసిక ఆరోగ్య సమస్యల పరిష్కారం, ఉచిత కన్సల్టేషన్, కౌన్సెలింగ్ సేవల కోసం హెల్ప్‌లైన్ సెల్. 80744 25979, 80743 40479 నెంబర్లకు రోజూ ఉదయం 11 నుంచి రాత్రి 7గంటల వరకూ నిరభ్యంతరంగా సంప్రదించవచ్చని తెలిపారు.

మండల సర్వసభ్య సమావేశం

రాప్తాడు : మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిపి బుల్లే విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా మండలంలోని అధికారులు తమ పరిధిలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. అంగన్వాడీ కేంద్రాల గురించి మాట్లాడుతూ మండలంలో 44 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా 34 సొంత భవనాల్లో ఉండగా మిగిలిన 10 అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నట్లు వివరించారు. అలాగే మండలంలోని 11,000 ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులు ఉండగా 6,976 కుటుంబాలు పనులకు వస్తున్నట్లు వివరించారు. ఎపిఎం సునీత మాట్లాడుతూ మండలంలో 865 మహిళా గ్రూపులు ఉన్నాయన్నారు. వీరితోపాటు అన్నిశాఖల అధికారులు వారి పరిధిలోని కార్యక్రమాలను వివరించారు. తర్వాత ఎంపిపి మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆకాలో రైతులకు సకాలంలో పంట నష్టపరిహారం అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి బోయ రామాంజనేయులు, ఎంపిటిసిలు వరలక్ష్మి, సర్పంచులు, ఉన్నత అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలు ఫాతిమాకు నివాళి

బ్రహ్మసముద్రం : ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన ఉపాధ్యాయురాలు షేక్ ఫాతిమాకు కవి, సామాజిక కార్యకర్త హేమావతి రాజన్న నివాళులర్పించారు. ఇందులో భాగంగా శుక్రవారం స్థానిక ఆర్టీటీ పాఠశాలలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్లాం మత చరిత్రలో ప్రథమ మహిళా ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వర్తించిన సంఘసంస్కర్త, జ్యోతిరావు పూలే సహచరిణిగా ఫాతిమా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీటీ ఉపాధ్యాయుడు నాగరాజు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలను కాపాడాలని వినతి

పామిడి : మండలవ్యాప్తంగా ఆక్రమణలకు గురవుతున్న శ్మశానాలను కాపాడాలని టిడిపి నాయకులు ఆర్ఆర్.రమేష్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీధర్‌మూర్తికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆర్ఆర్.రమేష్ మాట్లాడుతూ పెన్నానది ఒడ్డున, కొండూరు రోడ్డులో ఉన్న శ్మశానాలు సుమారు ఐదెకరాల విస్తీర్ణంలో ఉన్నాయన్నారు. అయితే ఆయా శ్మశానాలు ప్రస్తుతం అన్యాక్రాంతమై కుచించుకుపోయాయన్నారు. అదేవిధంగా డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించాలన్నారు. ఇందుకు స్పందించిన తహశీల్దార్ వెంటనే సర్వే చేసి శ్మశాన వాటికలకు హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బొమ్మా మోహన్, రాజశేఖర్‌గౌడ్, వెల్డింగ్ బాబా, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతల స్వీకరణ

యల్లనూరు : తాడిపత్రిలో సిఎస్‌డిటీగా విధులు నిర్వహిస్తున్న రాజును యల్లనూరు, పుట్లూరు, పెద్దపప్పూరు మండలాలకు ఇన్‌ఛార్జిగా నియమిస్తూ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే మండలంలోని కల్లూరు, సింగవరం, బుక్కాపురం, దంతలపల్లి, వెన్నపూసపల్లి గ్రామాల రెవెన్యూ అధికారులుగా మన్మథరెడ్డి, సత్యనారాయణ, రేణుక, నరసింహ, కేశవరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు.

తాగునీటి ట్యాంకు శుభ్రం

కళ్యాణదుర్గం రూరల్ : మండల పరిధిలోని మానిరేవు గ్రామ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.అనిల్‌కుమార్, మండలం కురుబ యూత్ ప్రెసిడెంట్ కార్తీక్ కలిసి సొంత నిధులతో గ్రామంలోని వెయ్యి లీటర్ల సామర్థ్యం ఉన్న తాగునీటి ట్యాంకును గురువారం శుభ్రం చేశారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు కాశప్ప, కురుబ వన్నూరుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఎక్సైజ్ సిఐ శుభాకాంక్షలు

కళ్యాణదుర్గంరూరల్ : లండన్‌లోని ప్రఖ్యాతిగాంచిన ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం మ్యూజియంలో మహాత్మా గాంధీ లీడర్‌షిప్ అవార్డు అందుకున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు ఎక్సైజ్ సిఐ అశాలతాను శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ అధికారులకు సన్మానం

బొమ్మనహాళ్ : మండలంలోని రెవెన్యూ కార్యాలయంలో పని చేసి బదిలీపై వెళ్తున్న వీఆర్‌ఓలు వన్నూరప్ప, హరిప్రసాద్, తిమ్మప్పను గురువారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మునివేలు, ఆర్ఐ బాలకృష్ణ, డిటి నాయక్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

గుత్తి : మండల పరిధిలో బుధవారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో మృతిచెందిన కుటుంబాలకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ సోదరుడు గుమ్మనూరు నారాయణ గురువారం ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని బేతాపల్లి గ్రామానికి చెందిన రైతు బోయ నాగరాజు ప్రమాదవశాత్తు చెక్ డ్యామ్‌లో పడి మరణించారు. గుత్తి పట్టణానికి చెందిన రంగనాయకులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. దీంతో గుత్తి ప్రభుత్వాసుపత్రిలో ఉన్న వారి మృతదేహాలను చూసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం బోయ నాగరాజు కుటుంబానికి రూ.15 వేలు, రంగనాయకులు కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి, పట్టణ మండల అధ్యక్షులు ఎంకె.చౌదరి, బద్రివలి, నాయకులు జక్కల చెరువు ప్రతాప్, చికెన్ శీనా, బి.రమేష్, నాగరాజు బేతాపల్లి శీనా, తదితరులు పాల్గొన్నారు.

నలుగురు బైండోవర్

యల్లనూరు : మండల పరిధిలోని బుక్కాపురం గ్రామంలో పొలం తగాదా విషయంలో అదే గ్రామానికి చెందిన నలుగురిపై గురువారం బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండల మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు.

ఇసుక అక్రమరవాణాను అరికట్టాలి

తాడిపత్రి రూరల్ : తాడిపత్రి రూరల్ పరిధిలోని పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పెన్నానది వంతెన వద్ద ఉన్న వరిచాటికాడు కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పెన్నానది నుంచి రాత్రి సమయాల్లో రోజూ పెద్దఎత్తున అక్రమంగా టిప్పర్లు, ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నారన్నారు. అయినా పోలీసులు, అధికారులు చోద్యం చూస్తూ పట్టించుకోవడంలేదన్నారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోకపోతే ఈనెల 14న తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు రంగయ్య, నాగ రంగయ్య, రామాంజి, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

12వ పిఆర్‌సి ప్రకటించాలి : ఎపిటిఎఫ్

అనంతపురం కలెక్టరేట్ : విజయదశమి సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పిఆర్‌సి ప్రకటించాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.నర్సింహులు, జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ఎపిటిఎఫ్ అనంతపురం జోనల్ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి సతీష్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ రమణ, ఆడిట్ కమిటీ కన్వీనర్ వన్నప్ప, జిల్లా నాయకులు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, హిమగిరి ప్రసాద్, ఈశ్వరయ్య, చిదంబరరెడ్డి, హనుమంతు, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మిద్దె పైనుంచి పడి పెయింటర్ మృతి

మృతిచెందిన పెయింటర్ పవన్‌కుమార్

అనంతపురం క్రైం : నగరంలోని శ్రీశ్రీ నగర్ కాలనీకి చెందిన పెయింటర్ పవన్‌కుమార్ మిద్దెపై నుంచి కింద పడి మృతిచెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. శ్రీశ్రీనగర్ చెందిన పవన్‌కుమార్ పెయింటర్‌గా పని చేస్తూ జీవనం సాగించేవాడు. ఇందులో భాగంగా పెయింటింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు ఇంటి మిద్దెపై నుంచి జారి కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో కుటుంబం అనాథలుగా మారారు. దాతలు, ప్రజాప్రతినిధులు కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చీనీ తోట దగ్ధం

గార్లదిన్నె : మండల పరిధిలోని పి.కొత్తపల్లి గ్రామానికి చెందిన రైతు ప్రభాకర్‌రెడ్డికి చెందిన చీనీతోటకు గురువారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. దీంతో 1,050 చీనీ చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. రైతు తెలిపిన వివరాల ప్రకారం.. తనకు ఉన్న ఏడెకరాల్లో 9ఏళ్ల కిందట చీనీ చెట్లను నాటానన్నారు. ప్రస్తుతం చెట్లు కాపుకు వచ్చాయన్నారు. ఈనేపథ్యంలో పంటతోపాటు పైపులు, డ్రిప్ వైరు, నీటి ట్యాంకులు పూర్తిగా కాలిపోయాయని కన్నీరుమున్నీరు అయ్యారు. తద్వారా సుమారు రూ.లక్ష వరకూ నష్టం సంభవించిందన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.



అగ్నికి ఆహుతైన చీనీచెట్లు

ఆటో బోల్తా..ఒకరికి గాయాలు

తాడిపత్రి రూరల్ : కూలీలతో ప్రయాణిస్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడి ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన రూరల్ పరిధిలోని పుట్లూరు రైల్వే గేటు సమీపంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. ఆటోనగర్ సమీపంలోని పుట్లూరు రోడ్డు రైల్వే గేటు వద్ద కూలీలతో ప్రయాణిస్తున్న ఆటో, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో కూలీలతో ఉన్న ఆటో పుట్లూరు రోడ్డు నుంచి సతీశ్ బైక్‌పై నుంచి సడన్‌గా రావడంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో 9 మంది ప్రయాణిస్తుండగా ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.